సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం : 10 : మే : 2024



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు 4లో ▸

అక్కడ.. ఇక్కడ కమలమే..

'సాక్షి'తో బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

- దేశంలో మోదీ, పాలమూరులో అరుణమ్మ గ్యారంటీ
- దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సే పరమావధిగా పనిచేస్తామని ప్రజలకు తెలుసు..
- నాపై వారికి అపారమైన నమ్మకం, విశ్వాసం.. వారే గెలిపిస్తారు..
- ఓడిపోతున్నామనే అక్కసుతోనే నాపై ప్రత్యర్థుల వ్యక్తిగత విమర్శలు
- స్థాయి మరిచి సంస్కారం లేకుండా మాట్లాడుతున్న సీఎం రేవంత్



'దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సే బీజేపీ లక్ష్యం. ఇందుకనుగుణంగానే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. పదేళ్ల పాలనలో భారత్‌ను విశ్వగురుగా నిలిపారు. దేశ భవిష్యత్ కోసం కేంద్రం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, అమలు చేసిన పలు కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం నింపడమే కాకుండా.. మోదీపై అభిమానం మరింత పెరిగేలా చేశాయి. ప్రజల కోసమే పనిచేస్తాననే మహబూబ్‌నగర్ ప్రజల నమ్మకమే నన్ను విజయతీరాలకు చేరుస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో మోదీ, పాలమూరులో అరుణమ్మ గ్యారంటీ.' అని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. 'బీజేపీకి ప్రధానమంత్రి అభ్యర్థి మోదీ ఉన్నారు.. కాంగ్రెస్‌కు ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరు? ఇప్పట్లో కేంద్రంలో ఆ పార్టీ వచ్చే అవకాశమే లేదు.' అని విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో డీకే అరుణ చెప్పిన వివరాలు ఆమె మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

'పాలమూరు'పై అనవసర రాద్ధాంతం..

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో నా పాత్ర ఎంతో ఉంది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో.. ఆయన నాయకత్వంలో జిల్లా అభివృద్ధికి కృషి చేశా. పాలమూరులో సాగునీటి ప్రాజెక్టుల సాధన నాతోనే సాధ్యమైంది. నేను కొట్లాడకపోతే ఆ ప్రాజెక్టులు వచ్చేవి కావు. పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదు అని బీఆర్ఎస్, కాంగ్రెస్ వాళ్లు ప్రశ్నిస్తున్నారు. ఏం చేశారో, ఏం జరిగిందో వారికి తెలవదా? ప్రధానంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతోనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెరపైకి వచ్చింది. పాత డీపీఆర్ ప్రకారం ఈ ప్రాజెక్టును జూరాల బ్యాక్‌వాటర్ ఆధారంగా చేపట్టాలి. అలాంటిది రాష్ట్రంలో గత ప్రభుత్వం శ్రీశైలం ఆధారంగా ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభించింది. కమీషన్ల కోసమే పాత డీపీఆర్‌ను మార్చిందనేది జగమెరిగిన సత్యం. శ్రీశైలంను సోర్స్‌గా చేసుకోవడం వల్ల జాతీయ హోదా సాధ్యం కాలేదు. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టుకు 60శాతం నిధులు ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీనిపై ఇదివరకే స్పష్టంగా చెప్పినా. కాంగ్రెస్ నేతలు కావాలనే అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. ఇప్పటికీ చెబుతున్నా పాత డీపీఆర్ ప్రకారం పీఆర్ఎల్ఐ చేపడితే జాతీయ హోదా తెస్తా. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.

మోదీ చరిష్మా.. నాపై నమ్మకమే..

ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, బలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, కోవిడ్ మహమ్మారి కట్టడికి తీసుకున్న చర్యలు, విదేశాలకు సైతం కరోనా వ్యాక్సిన్లు అందజేయడం, భారత్‌లో జీ–20 సదస్సు నిర్వహణ ఇలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పలు విప్లవాత్మక కార్యక్రమాలు ప్రజలను మోదీకి, పార్టీకి దగ్గర చేశాయి. ప్రచారం నిమిత్తం ఏ గ్రామానికి, పట్టణానికి వెళ్లినా అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మోదీ చరిష్మా నాకు కలిసి వస్తుంది. ప్రజలకు సేవ చేస్తాననే ప్రజల్లో నాపైన ఉన్న నమ్మకం నన్ను గెలిపిస్తుంది. కేంద్రంలో మోదీ, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో నన్ను గెలిపించాలని ప్రజలు ఇదివరకే నిర్ణయం తీసుకున్నారు.

ఓడిపోతామనే భయంతోనే వ్యక్తిగత దూషణలు..

నా పుట్టినిల్లు, మెట్టినిల్లు ఇక్కడే. ఎన్నికల్లో గెలిచినా.. ఓడినా ప్రజాసేవలోనే ఉన్నాను. ఇది ప్రజలందరికీ తెలుసు. నేను స్థానికురాలు కాదు అని నాపై ఆరోపణలు చేసే వారు.. ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నారు..? ప్రజాసేవ చేస్తూ నా కుటుంబసభ్యులు ఇద్దరు అమరులయ్యారు. స్థాయి మరిచి సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. నా కుటుంబాన్ని అభాసుపాలు చేయాలని సంస్కారం మరిచి.. ఆడబిడ్డ అని కూడా చూడకుండా దూషణలకు దిగుతున్నారు. బంగ్లా పాలన అంటున్నారు.. ఇప్పుడు మీ వెంట బంగ్లా వాళ్లు లేరా? నా కుటుంబం ఇప్పుడే వ్యాపారాలు చేస్తుందా.. కాంట్రాక్టులు చేస్తుందా? కాంట్రాక్టులు చేసే వారు ఏమన్నా దొంగలా? బీజేపీలో చేరిన తర్వాతే ఇవన్నీ గుర్తుకువస్తాయా? మేం విలువలకు కట్టుబడి ఉంటాం. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయం. ఓడిపోతామనే భయంతోనే సీఎం, ఇతర కాంగ్రెస్ నాయకులు కావాలనే విమర్శలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోతున్నారనే ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఏడెనిమిది సార్లు పర్యటించారు. దీన్ని బట్టే అర్థమవుతోంది. ఇక్కడ నేను, దేశంలో మోదీ ప్రభుత్వం రావడం ఖాయం.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..

మహబూబ్‌నగర్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతా. స్మార్ట్ సిటీ హోదా తీసుకొచ్చి పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించడంతో పాటు మున్సిపాలిటీలకు కేంద్ర నిధులు వచ్చేలా కృషి చేస్తా. హైదరాబాద్–బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్, షాద్‌నగర్‌లో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తా. పీఎం మిత్ర కింద నారాయణపేటలో టెక్స్‌టైల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్, మిల్లెట్, మ్యాంగో ఫుడ్ చైన్ క్లస్టర్ల ఏర్పాటు, కృష్ణా రైల్వే లైన్ పూర్తి చేయిస్తా. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పాలమూరు యూనివర్సిటీతో ఐఐటీహెచ్, బిట్స్‌పిలానీ మధ్య భాగస్వామ్యం నెలకొల్పడం, ప్రసాద్ స్కీం కింద కురుమూర్తి, మాణికేశ్వరి, చెన్నకేశవ, మన్యంకొండ వేంకటేశ్వరస్వామి ఆలయాలను అభివృద్ధి చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, కేంద్ర విద్యాసంస్థలు ఐఐటీ, ఎన్ఐటీ నెలకొల్పేలా పాటుపడడంతో పాటు క్రీడా మైదానాల ఏర్పాటు, నారీ శక్తి కింద ముద్ర యోజన, లక్‌పతి దీదీ కింద రుణాలు అందేలా చూస్తా.

పేటకు పీఎం మక్తల్‌కు సీఎం

నేటి బహిరంగసభలో మోదీ, జనజాతర సభలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

- భారీ బందోబస్తు కల్పిస్తున్న పోలీస్‌శాఖ





నారాయణపేట/ మక్తల్: పార్లమెంట్ పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రచారం ఊపందుకుంటోంది. ఈ క్రమంలోనే శుక్రవారం జిల్లాలో ఇద్దరు అగ్రనేతలు పర్యటించనున్నారు. పేటలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. మక్తల్‌లో చేపట్టే జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ శాఖ పటిష్ట భద్రత చేపట్టనుంది. ఈ మేరకు జిల్లాకేంద్రంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. అలాగే గురువారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు. ప్రధాని మోదీ పేటలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో బహిరంగ సభలో పాల్గొననుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల ఎస్పీలతో పాటు నలుగురు ఏఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 72 మంది ఎస్ఐలు, 150 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 550 మంది కానిస్టేబుళ్లు, 200 హెచ్‌జీలు, వంద మంది మహిళా పోలీసులు, నాలుగు రోప్ పార్టీలు, 4 టీఎస్ఎస్‌పీ ప్లాటూన్స్, శిక్షణ, స్పెషల్ పార్టీ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు. బందోబస్తును 11 సెక్టార్లుగా విభజించి పకడ్బందీగా బందోబస్తు కల్పిస్తామని, పోలీస్ అధికారులు తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మక్తల్‌లోని ఎల్లమ్మకుంటలో శుక్రవారం జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననుండటంతో గురువారం ఏర్పాట్లను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎస్పీ యోగేష్‌గౌతమ్ పరిశీలించారు. అలాగే జనజాతర సభకు దాదాపు 700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. హెలీప్యాడ్ స్థలం వద్ద, బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను పరిశీలించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా పోలింగ్ ఏర్పాట్లపై 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. పోలింగ్ కేంద్రం భవనానికి డోర్స్, కిటికీలు, కుర్చీలు, బయట టెంట్, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫర్నిచర్ వర్కింగ్ కండిషన్‌లో ఉండాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం టెంట్, తాగునీరు సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లైటింగ్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రంలో గ్యాప్‌లు ఉంటే తహసీల్దార్, ఏఆర్‌ఓలకు రిపోర్ట్ చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్ క్యాస్టింగ్, పోలింగ్ కేంద్రంలో కెమెరాలు సరైన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్యాధికారి, పారా మెడికల్ సిబ్బందితో ప్రథమ చికిత్స కిట్టు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఓటరు సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో 5 మోడల్ పోలింగ్ కేంద్రాలు, మహిళల కోసం 5 పోలింగ్ కేంద్రాలు, పీడబ్ల్యూడీ కోసం ఒక పోలింగ్ కేంద్రం, యువత కోసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది, పోలీస్, వెబ్ కాస్టింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. సాక్ష్యం ఆప్‌లో దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు వీల్‌చైర్, సహాయకులు, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఓటరు జాబితా మార్క్‌డ్, వర్కింగ్ కాపీలు సిద్ధంగా ఉంచాలన్నారు. డీఆర్‌సీ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో జనరేటర్, వాటర్ ప్రూఫ్ టెంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్‌కు ముందు రోజు సాయుధ ఎస్కార్ట్‌తో ఈవీఎం, సామగ్రి తరలించాలని, పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్‌కు తరలించి భద్రపరచాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అగ్నిమాపక వాహనం, కౌంటింగ్ కేంద్రాల్లో కూడా సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌ఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

యువకుడి దుర్మరణం

ధరూరు: లారీ నుంచి హిటాచీ వాహనాన్ని దించే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. వివరాల్లోకి వెళితే.. ఎర్రవల్లి మండలం గార్లపాడు చెందిన ఈదన్న(33) జేసీబీ, హిటాచి వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ద్యాగదొడ్డి సమీపంలో ఓ రైతు పొలం నిమిత్తం హిటాచి వాహనాన్ని లారీలోంచి కిందకు దించే క్రమంలో మరో డ్రైవర్ సంతోష్ నిర్లక్ష్యం వహించడంతో జేసీబీ వెనక భాగంలో ఉన్న ఈదన్న ఎదలకు బలంగా తాకడంతో గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తేనెటీగల దాడిలో మరో యువకుడు..


విస్లావత్ తారక్ (ఫైల్)

మన్ననూర్: తేనెటీగల దాడిలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన నల్లమలలో గురువారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం మన్ననూర్ సమీపంలోని ఉమామహేశ్వర తండాకు చెందిన విస్లావత్ తారక్ (22) గురువారం ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. మామిడిచెట్టు కొమ్మకు ఉన్న తేనెతెట్టను గమనించక దాని కిందనుంచి వెళ్తుండగా ట్రాక్టర్ పొగకు ఒక్కసారిగా లేచి దాడి చేశాయి. దీంతో అరుపులు, కేకలు వేస్తూ కిందపడి పొర్లాడుతుండగా.. అదే సమయానికి భోజనం తీసుకొచ్చిన తాత చంద్రూనాయక్ గమనించి చెట్ల కొమ్మలు, పొగ ఏర్పాటు చేసి వాటి బారి నుంచి కాపాడాడు. వెంటనే గ్రామస్తుల సాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

టైర్ పేలి లారీ డ్రైవర్..

ఉండవెల్లి: లారీ టైర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ కమ్మరి హరికృష్ణ (30) బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల మేరకు.. కర్నూల్ జిల్లా గొన్నెగండ్లకు చెందిన లారీ డ్రైవర్ హరికృష్ణ సిమెంట్ లోడ్‌తో అయిజకు వస్తుండగా.. పుల్లూరు శివారులోని జాతీయ రహదారిపై లారీ టైర్ పంక్చర్ అయ్యింది. టైర్ మారుస్తున్న క్రమంలో మరో టైర్ ఒక్కసారిగా పేలడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కర్నూల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

బాలానగర్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ కథనం ప్రకారం.. గౌతాపూర్‌కి చెందిన శ్రీకాంత్ (28) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ.. నొప్పిభరించలేక తాగుడు బానిసయ్యాడు. కాగా బుధవారం రాత్రి కడుపునొప్పి భరించలేక పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎండలకు జింక మృత్యువాత



మరికల్: మండుటెండలకు మూగజీవాలు అల్లాడుతున్నాయి. దాహం తీర్చుకోవడానికి గుక్కెడు నీళ్లు లేక మృత్యువాత పడుతున్నాయి. కొన్ని రోజుల నుంచి 45 సెం.మీ. డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మరికల్ శివారుల్లో గురువారం జింక ఎండలకు తాలలేక, దాహం తీర్చుకోవడానికి నీళ్లులేక మృత్యువాత పడింది. అటవీ శాఖ అధికారులు స్పందించి జింకలు సంచారిస్తున్న ప్రాంతాల్లో నీటితొట్లను ఏర్పాటు చేసి వాటి దాహం తీర్చాలని రైతులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: తాళం వేసిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన స్థానిక వెంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు..కాలనీలో నివాసం ఉంటున్న కాట్రావత్ సునీత ఈనెల 7న తన సోదరి గ్రామంలో పోషమ్మ పండుగకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో ఉన్న బంగారు గొలుసును అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. దాని విలువ రూ.25వేలు ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవిశ్వాసానికి వేళాయె..!



జడ్చర్ల పుర కార్యాలయం

జడ్చర్ల పుర పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి
- చైర్‌పర్సన్ లక్ష్మికి పదవీ గండం?
- అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయారన్న ఆరోపణలు
- పావులు కదుపుతున్న కౌన్సిలర్లు

జడ్చర్ల: స్థానిక పుర పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు గడిచింది. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు ఆమెను పదవి నుంచి దింపేందుకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల కిందటే పాలకమండలిలో ముసలం ఏర్పడగా.. చైర్‌పర్సన్, కౌన్సిలర్ల పనితీరుపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఇది కాస్త అసెంబ్లీ ఎన్నికల సమయానికి తీవ్ర రూపం దాల్చింది. అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నీ తానై అందరిని బుజ్జగించి పట్టణంలో ఓట్ల శాతం పెంచుకునే ప్రయత్నం చేసినా ఓటమిని చవిచూశారు. లక్ష్మారెడ్డి ఓటమికి పాలకమండలి వ్యవహారాలే ప్రధాన కారణమని అంతా భావించారు. ఇదే అదనుగా భావించి చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దింపాలన్న డిమాండ్ పాలకమండలి తమ అధినేత ఎదుట బలంగా ఉంచారు. అయితే అవిశ్వాసానికి గడువు ఉండటం.. సభ్యులకు నచ్చజెప్పడంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ నెల 7వ తేదీతో మూడేళ్ల పదవీకాలం ముగియడంతో అవిశ్వాసానికి మార్గం సుగమమం కావడంతో కౌన్సిలర్లు మరోసారి తమ స్వరం పెంచారు. ఇప్పటికే పలు మార్లు చైర్‌పర్సన్ వైఖరిని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. దీంతో ఆయనే కౌన్సిలర్లకు నచ్చజెప్పుతూ అన్నీ తానై నెట్టుకొచ్చారు. చైర్‌పర్సన్ లక్ష్మి రవీందర్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చినా కూడా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వాటిని తిప్పికొట్టారు. రవీందర్ వైఖరిలో మార్పు రాకపోవడం, కౌన్సిలర్లను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో అవిశ్వాసమే సరైన మార్గమని సభ్యులు భావిస్తున్నారు.

ఎంపీ ఎన్నికల తర్వాతే..

ఎంపీ ఎన్నికల తర్వాత చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వాలన్న ఆలోచనలో కౌన్సిలర్లు ఉన్నారు. మూడేళ్ల గడువు ముగియడంతో రెండ్రోజుల కిందట కొందరు సభ్యులు సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎన్నికల సమయం ఉండటంతో ఆ ప్రతిపాదనపై లక్ష్మారెడ్డి గుర్రుగా ఉన్నారని సమాచారం. ఏదేమైనా సొంత పార్టీ వారే అవిశ్వాసానికి సిద్ధమవుతుండటంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కూడా వారికి సహకరించే పరిస్థితి ఉంది.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు..

పురపాలికలో మొత్తం 27 వార్డులుండగా.. బీఆర్‌ఎస్ నుంచి 23, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు గెలుపొందారు. అనంతరం బీజేపీ నుంచి ఒకరు, బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కే సంఖ్యాబలం ఉన్నా.. చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్‌పై ఉన్న అసంతృప్తి కారణంగా సొంత పార్టీ వారే పదవి నుంచి దింపేందుకు సిద్ధమవుతున్నారు. వీరికి కాంగ్రెస్, బీజేపీ సభ్యులు మద్దతు పలుకుతున్నారు.

ప్రొటోకాల్‌కే పరిమితమైన చైర్‌పర్సన్..

చైర్‌పర్సన్ లక్ష్మి ప్రొటోకాల్‌కే పరిమితమైంది. సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకపోవడం.. సభ్యులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఏకాభిప్రాయంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ఇక ఆమె భర్త రవీందర్ పాలనలో షాడోగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అంతేగాక బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

అర్థం కావడం లేదు..

పాలన పారదర్శకంగానే కొనసాగిస్తున్నా.. తనపై సభ్యులు ఎందుకు అసంతృప్తితో ఉన్నారో అర్థం కావడం లేదు. రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఎదురైతే తనతో పాటు తనను వ్యతిరేకిస్తున్న కౌన్సిలర్లు కూడా రాజీనామా చేసి తిరిగి పోటీ చేద్దాం.
– లక్ష్మి, చైర్‌పర్సన్

మారుద్దామా..?

మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రవీందర్‌ను మార్చేందుకు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన నాటి నుంచే సొంతపార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉండటం ఆయనకు తలనొప్పిగా మారింది. అయితే అవిశ్వాసం పెట్టి తొలగించి పార్టీకి అప్రతిష్ఠ తేకుండా స్వయంగా రాజీనామా చేయించి బీఆర్‌ఎస్‌కు చెందిన మరో మహిళా కౌన్సిలర్‌ను చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు వీలుగా తామంతా కట్టుబడి ఉంటామని కౌన్సిలర్లు వివరించినట్లు తెలిసింది. దీనిపై మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల పరిశీలన


గేలాక్సీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భూటియా

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాకేంద్రంలోని ఏనుగొండ, వెంకటేశ్వరకాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సేవాంగ్ గ్యాచో భూటియా గురువారం పరిశీలించారు. ఏనుగొండలోని హనుమాన్ భజన మండలి కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన వికలాంగుల పోలింగ్ కేంద్రం, వెంకటేశ్వర కాలనీలో గేలాక్సీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సూచనలు చేశారు.

అభ్యర్థుల ఖర్చుల వివరాల తనిఖీ


ఖర్చుల వివరాలు పరిశీలిస్తున్న వరుణ్ రంగస్వామి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను మూడో విడత తనిఖీలో భాగంగా వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి తనిఖీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు, నోడల్ టీం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, సహాయ వ్యయ అధికారులతో అభ్యర్థుల వ్యయ ఏజెంట్లు, బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఎన్నికల వ్యయ చెల్లింపులు, ఓచర్లు, ఏ, బీ, సీ వ్యయ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

నగదు, మద్యం పట్టివేత


బాలానగర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదు


జలాల్‌పూర్ వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

వనపర్తి: జిల్లా కేంద్రంలో బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గురువారం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపల్లి తండాకు చెందిన చంద్రు తన బైక్‌పై రెండు కార్టన్ల బీర్లు, మరికొన్ని మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. 15.6 లీటర్ల బీర్లు, 2.2 లీటర్ల మద్యంతో పాటు మోటర్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

బాలానగర్: మండల కేంద్రంలో నగదును పోలీసులు పట్టుకున్నారు. గురువారం చెక్‌పోస్టులో కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్ మండలం గోనెగండ్లకు చెందిన కె.చంద్ర వద్ద నుంచి రూ.57వేల నగదు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు వాహనాలు తనిఖీ నిర్వహించగా కర్ణాటక, యాద్గిరి నుంచి నారాయణపేటకు వస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 2,76,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లెలో బెల్టు షాప్‌పై గురువారం దాడులు నిర్వహించి 50 లీటర్ల మద్యంను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. కొంకన్వానిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నాడన్న సమాచారంతో దాడులు చేశామన్నారు.

గోపాల్‌పేట: అనుమతులు లేకుండా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని బుద్ధారంలో గురువారం అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన శివకుమార్ ఎలక్ట్రికల్ షాపులో రూ.7,920 విలువ చేసే 7.2 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

జూరాలలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది


జూరాల జలాశయంలో దూకిన మహబూబ్

అమరచింత: తాగుడుకు బానిసై మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి జూరాల జలాశయంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌కుమార్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన మాల మహబూబ్ టైలరింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. తాగుడుకు బానిసైన మహబూబ్ చేతిలో డబ్బులు లేకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం జూరాల జలాశయంలో దూకగా గమనించిన జాలర్లు పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బందితో వచ్చిన ఎస్‌ఐ బెలూన్ల సాయంతో ఈత కొడుతున్న మహబూబ్‌ను రక్షించి ఒడ్డుకు చేర్చారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

వివాహిత మృతదేహంతో ఆందోళన


ఉయ్యాలవాడలో సతీష్‌రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్

నాగర్‌కర్నూల్ క్రైం: హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఈనెల 7న ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి (32) మృతదేహంతో గురువారం మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడలో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారి వివరాల మేరకు.. ఉయ్యాలవాడకు చెందిన సతీష్‌రెడ్డికి, లింగసానిపల్లికి చెందిన స్వాతితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా భర్త వేధింపులు అధికం కావడంతో ఈనెల 7న స్వాతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనపై హైదరాబాద్‌లో పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం రాత్రి స్వాతి మృతదేహాన్ని ఉయ్యాలవాడకు తీసుకొచ్చారు. ఆమె మృతికి కారణమైన భర్త సతీష్‌రెడ్డిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని, సతీష్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో పాటు పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. ఈవిషయమై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. స్వాతి ఆత్మహత్యపై హైదరాబాద్‌లోనే కేసు నమోదైందని.. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడకుండా పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

14న ఎన్టీఆర్‌లో జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని సూచించారు.

సోనామసూరి ధర రూ.2,354



దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,354, కనిష్టంగా రూ.2,039 చొప్పున ధరలు లభించాయి. అలాగే ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,509, కనిష్టంగా రూ.5,482 పలికింది. మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

దాయాదుల దాడిలో యువకుడికి గాయాలు

నర్వ: భూతగాదాల కారణంగా దాయాదులు కాపు కాచి దాడిచేయడంతో యువకుడికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమయ్య కథనం ప్రకారం.. రాయికోడ్‌కి చెందిన కావలి అంజి(26), ఇదే గ్రామానికి చెందిన ఎద్దుల రవికి మధ్య ఐదేళ్ల క్రితం నుంచి భూతగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో పరస్పరం ఆరోపణలు చేసుకొని గతంలో పంచాయతీలు చేసుకున్నారు. కాగా గురువారం కాపు కాచి ఎద్దుల రవి.. కావలి అంజిపై కత్తితో స్థానిక చెరువు కట్టపై దాడి చేశాడు. దీంతో అంజి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబసభ్యులు పోలీస్‌లకు సమాచారం అందించి నర్వ పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిమిత్తం చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. కాగా బాధితుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీయూ క్యాంపస్ సెలక్షన్స్‌లో 34 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం చేపట్టిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 34 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు అన్నపూర్ణ ఫైనాన్స్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ చేపట్టగా అందులో ఎంబీఏ, ఎంకాం విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్ మాట్లాడుతూ పీయూ విద్యార్థులు అన్ని సెలక్షన్స్‌లో పూర్తిస్థాయి ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. ఎంపికల్లో ఒకేసారి 34 మంది ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయం అని, ఎంపికైన వారికి త్వరలోనే వీసీ సమక్షంలో అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

అలంపూర్: కత్తులతో బెదిరించి ఒకే రోజు రెండు చోట్ల చోరీలకు పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష విధించినట్లు ఎస్పీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మానవపాడు స్టేజీ లోని శ్రీచక్ర కోల్డ్ స్టోరేజీలో 2018 మార్చి 25వ తేదీ రాత్రి నలుగురు వ్యక్తులు స్టోరేజీలో వాచ్‌మన్ గా పని చేస్తున్న శంకర్‌రెడ్డి కుటుంబాన్ని కత్తులతో బెదిరించి అతడి భార్య మెడలోని పుస్తెల గొలుసు, చైన్, కమ్మలు, కూతురి మెడలోని బంగారు గొలుసు, చెవి కమ్మలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అదే రోజు నలుగురు వ్యక్తులు ఉండవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో ప్రకాశం జిల్లాకు చెందిన ఏడుగురు తాపీ మేస్త్రీలు కొత్త బిల్డింగ్ పనుల నిమిత్తం అక్కడే అద్దె ఇంట్లో ఉండగా అక్కడికి వచ్చిన నలుగురు ముఠా సభ్యులు కత్తులతో బెదిరించి చేతులు కట్టేసి ఒక అమ్మాయి కాళ్ల పట్టీలు, రూ. 42వేల నగదు, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు ప్రకాశం జిల్లా కుర్చపాడు మండలం తిమ్మనపాలెం చెందిన వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నలుగురు ముఠాగా కలిసి ఒకే రోజు రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో కత్తులతో బెదిరించి వెండి, బంగారం ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లగా, కేసులో అప్పటి అధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో మహారాష్ట్రకు చెందిన వారీగా గుర్తించినట్లు తెలిపారు. మహారాష్ట్రకు వెళ్లి నాందేడ్ చుట్టు పక్కన 10 రోజులు నిఘా ఉంచి నలుగురు నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ కేసులో జడ్జి ఏ2 నాందేడ్‌కు చెందిన భీమా నర్సింగ్ వాగ్మోర్, ఏ3 దాండ్ల బాబు, ఏ4కు మాణిక్ బండార్ శివార్ 2019లో డిసెంబర్ 23వ తేదీన రెండు నెలల జైలు శిక్ష రూ. 100 జరిమానా విధించినట్లు తెలిపారు. ఏ1గా ఉన్న నాందేడ్‌కు చెందిన మెత్కర్ లకన్ పిరాజీ వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఎన్‌బీడబ్ల్యూ వారంట్ జారీ చేసినట్లు తెలిపారు. ఎన్‌బీడబ్ల్యూ వారంట్ జారీ కావంట్‌తో పీటీ వారెంట్ ఇవ్వడంతో అలంపూర్ కోర్టులో గురువారం హాజరుపరిచినట్లు తెలిపారు. నేరం ఒప్పుకోవడంతో జడ్జి కవిత నిందితుడికి సంవత్సరం 5 నెలల 6 రోజుల జైలు శిక్షతోపాటుగా రూ.200 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్షపడానికి సహకరించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్ రాజును, అప్పటి సీఐలు రజిత, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పర్వతాలు, సంతోష్, చంద్రమోహన్, ప్రస్తుత ఎస్‌ఐలు శ్రీనివాసులు, చంద్రకాంత్, కోర్టు కానిస్టేబుల్‌లు గిరి, శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.

నిందితుడి కోసం పోలీసుల గాలింపు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో పందులను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్న కేసులో నిందితుడిగా ఉన్న స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసుకు సంబంధించి విచారించేందుకు తాము రవీందర్ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. వారం రోజులుగా నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నట్లు స్థానిక సీఐ ఆదిరెడ్డి గురువారం తెలిపారు.

మరోసారి చర్చలు విఫలం


చర్చల్లో పాల్గొన్న ఫ్యాక్టరీల యజమానులు, కార్మిక సంఘాల నాయకులు

చిన్నచింతకుంట: కనీస వేతన కూలి పెంచాలని బీడీ కార్మిక సంఘాల నాయకులకు, ఫ్యాక్టరీ యజమానులకు గురువారం మహబూబ్‌నగర్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. వెయ్యి బీడీలు చుడితే కనీస వేతన కూలితో పాటు కార్మికులకు పీఎఫ్ జమచేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేయడంతో యాజమాన్యం ఒప్పుకోలేదని ఐఎఫ్‌టీయూ నాయకుడు జేఎస్ దేవదానం తెలిపారు. దీంతో చర్చలు విఫలమయ్యాయని.. మరోసారి నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యాజమాన్యం సుధాకర్‌రెడ్డి, సోహెల్, జియా, వాసిమ్, వజీర్‌బాబ్, అఖీఫ్, కార్మిక సంఘాల నాయకులు కే. సూర్యం, కోళ్ల వెంకటన్న, అడివన్న, సామేల్, అరుణ్ కుమార్, సి. వెంకటేష్, వేణుగోపాల్, మహిమూద్, బుచ్చన్న, యాదగిరి, ఖలీల్, షాంసుందర్, అబ్రహంలతోపాటు పలువురు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామికి భక్తులు అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని కానుకలుగా సమర్పించిన హుండీని ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.7,42,073 వచ్చినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్య క్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వివిధ సేవా సమితి సభ్యులు, భక్తులు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, దినేష్, శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED
- Prakruthi Entrepreneurs Pvt Ltd Village Mart Managers & Mandal Dealers, Salary 56000/- Best opportunity Contact: 9963560410
- లేడీ వార్డెన్లు కావలెను, అర్హత:: 10వ తరగతి, జీ.టి. నారాయణ స్కూల్, కొత్తకోట. సెల్. 9985431451
- విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91606 35559, 98650 25559

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

తెలంగాణలో మోదీ మేనియా..

● కోలార్ ఎంపీ మునిస్వామి



కొకుంట్లలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న కోలార్ ఎంపీ మునిస్వామి

దేవరకద్ర: తెలంగాణలో మోదీ మేనియా కొనసాగుతున్నదని, ఎక్కడికి వెళ్లినా మోదీ ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారని కర్ణాటకకు చెందిన కోలార్ బీజేపీ ఎంపీ మునిస్వామి అన్నారు. గురువారం రాత్రి కొకుంట్ల మండల కేంద్రంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలు మరోసారి మోస పోవడానికి సిద్ధంగా లేరని, అందరు బీజేపీ వైపే చూస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని మోదీ మరోసారి ప్రధాని అవుతారన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మునిస్వామి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్రనాయక్

అచ్చంపేట: పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి రవీంద్రనాయక్ అన్నారు. గురువారం అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల హామీల మేరకు ప్రతి మహిళా ఖాతాలో రూ.15 లక్షలు వేశారా.? 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా.? 4 లక్షల ఇళ్లు ఎక్కడ కట్టారు? సబ్‌కా వికాస్ ఎక్కడ ఉందో చూపాలని డిమాండ్ చేశారు. ప్రజాసంక్షేమాన్ని పక్కనబెట్టి, ప్రజల మధ్య మతపరమైన మాటలతో అపోహలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేయాలని మోదీ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కాగా, పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు ఆగమయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో మోపతయ్య, రాజేందర్, కొయ్యల శ్రీనివాసులు ఉన్నారు.

రామరాజ్యం రావాలంటే మోదీ రావాలి



హన్వాడలో మాట్లాడుతున్న డీకే అరుణ

హన్వాడ/ధన్వాడ: దేశంలో రామరాజ్యం రావాలంటే.. మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. గురువారం ఆమె మండలకేంద్రంతో పాటు గొండ్యాల్, వేపూర్, టంకరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మొద్దని సూచించారు. మహిళలకు పెళ్లి కానుకగా రూ.లక్షతో పాటు తులం బంగారం అన్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్ అంటూ మోసపూరిత వాగ్దానాలు చెప్పి మాయ చేసిన కాంగ్రెస్ నేడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మరో మారు గ్యారంటీల పేరిట వచ్చిందని, వాటిని ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అగం చేసిన కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, దేశంలో మరో మారు బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, కొండ బుచ్చన్న, లక్ష్మణ్‌నాయక్, లింగం, శ్రీను పాల్గొన్నారు.

రాజకీయంగా అణగతొక్కేందుకు కుట్ర

గతంలో తన తండ్రి నర్సిరెడ్డిని రాజకీయంగా ఎదగనివ్వకుండా జైపాల్‌రెడ్డి అణగతొక్కారని, ఇప్పుడు కల్వకుర్తికి చెందిన రేవంత్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి కుమ్మక్కై మళ్లీ తనను రాజకీయంగా తొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ ఆరోపించారు. ధన్వాడ మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ధన్వాడకు అనేక పనులు చేశానని, పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపిస్తే అన్ని విధాలుగా మండలాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. జూనియర్ కళాశాల, మోడల్ పాఠశాల, కేజీబీవీ, సీసీ రోడ్లు మంజూరు చేసి విద్యాపరంగా ముందుకు వెళ్లేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పాలకులు మహిళలకు బస్సులో ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని అన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఊర్కొండలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

మిడ్జిల్/ఊర్కొండ: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని.. పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. గురువారం మిడ్జిల్‌లో జరిగిన బహిరంగ సభ, ఊర్కొండలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కట్టించిన ఇందిరమ్మ ఇళ్లు నేటికీ గ్రామాల్లో కనిపిస్తున్నాయని, పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క ఇల్లు నిర్మించినా తాను ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మీ ఓటు ద్వారా జెడ్పీటీసీగా గెలిచిన రేవంత్‌రెడ్డి నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో మండలం నుంచి భారీ మెజార్టీ ఇస్తే మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని తన మాటగా మండల ప్రజలకు చెప్పమని పంపించారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో దోపిడీలు, భూకబ్జాలు ఉండేవని.. అలాంటి పనులు చేసేవారి భరతం పడుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలు జూన్ 4 తర్వాత పూర్తిస్థాయిలో అమలవుతాయని, ఆగస్టు 15 వరకు పంట రుణమాఫీ చేస్తామని వివరించారు. మిడ్జిల్‌లో జరిగిన సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రబ్బానీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ భీమయ్యగౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, జగన్, నాయకులు గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాములు, నర్సింహులు, అశోక్, శివ, కృష్ణ, ఊర్కొండలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పాలమూరు స్థానిక సంస్థల అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముగోని వెంకటయ్యగౌడ్, ధ్యాప నిఖిల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరస్వామి మాదిగ, జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా మైనార్టీ ప్రధానకార్యదర్శి అబ్దుల్ సమీ, యువజన విభాగం అధ్యక్షుడు విజయుడు, ఆరీఫ్, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతు రుణం మాఫీ చేసి తీరుతాం

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వెల్దండలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వెల్దండ/చారకొండ: కాంగ్రెస్ పార్టీతోనే రామరాజ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా వెల్దండ, చారకొండ మండల కేంద్రాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో ఉండి, కాలం వెల్లదీసిన బీఆర్‌ఎస్ నాయకులు.. మరల రోడ్లపైకి వచ్చి కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఇటీవల ఆపార్టీ నేత కేటీఆర్ మాట్లాడిన మాటలే ఇందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రుణం తీర్చుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించి, అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, ఎన్నికల ఇన్‌చార్జి ఇందిర శోభన్, చారకొండ వెంకటేష్, ఎంపీ అభ్యర్థి మల్లు రవి సతీమణి రాజబన్సిదేవి, ఎంపీపీ నిర్మల, విజేందర్‌గౌడ్, మోతీలాల్, బాల్‌రాంగౌడ్, సంజీవ్ యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, ఎర్ర శ్రీను, కృష్ణ, భీముడునాయక్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మల్లు రవి

తాడూరు: దేశంలో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తాడూరులో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. దేశంలో పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పేదలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. పేదల పార్టీ కాంగ్రెస్ దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఒకప్పుడు దేశ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, కనీసం గుండుసూది తయారు చేసుకోలేని పరిస్థితిలో ఉన్న దేశాన్ని కంప్యూటర్ యుగంలోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. బీజేపీ ప్రభుత్వం నుంచి దేశానికి విముక్తి కల్పిద్దామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో లౌకిక రాజ్యం, రాజ్యాంగ రక్షణ కోసం జరుగుతున్న ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో మత విభజన జరుగుతుందని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, హక్కులకు భంగం ఏర్పడుతుందని, స్వేచ్ఛ, సమానత్వం లేకుండా పోతున్నాయని విమర్శించారు. ప్రజలందరూ వీటిని గమనించి బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా బడాబాబులకు ప్రభుత్వ సొమ్మును ధారాదత్తం చేశారని విమర్శించారు. నియంతృత్వ పోకడలు, రాముడు, మతం పేరుతో ప్రజల దృష్టిని మరల్చి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు బీజేపీ పోకడలను గమనించి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నారాయణ, బాలస్వామి, సత్యం, చంద్రయ్య, నిరంజన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉంది

● తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి
● కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి మురుగన్



అచ్చంపేటలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురుగన్

అచ్చంపేట: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే.. రిజర్వేషన్లు రద్దు చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచారాన్ని ప్రజలే తిప్పి కొడుతారని కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంతి మురుగన్ అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని, సీఎం అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి ఓట్లు వేస్తే రాహుల్‌గాంధీ, ఇండియా కూటమిలోని వారు ఎవరూ పీఎం కారన్నారు. 10ఏళ్లలో మోదీ చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేయండని కోరారు. 400 సీట్లు గెలిచి అధికారం చేపడుతామని, అందులో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. రూ.2,400 కోట్లతో కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి, సోమశిల కేబుల్ బ్రిడ్జి మంజూరు చేశామన్నారు. గద్వాల–డోర్నకల్ రైల్వేలైన్ ఏర్పాటుకు సర్వే జరుగుతుందని, కొల్లాపూర్‌లో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిందని, మంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలు, 12 మంది ఎస్సీలు, 9మంది ఎస్టీలు, 10 మంది మహిళలు మంత్రులుగా ఉన్నారని, 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీది అన్నారు. కాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టిన తర్వాత దేశ ప్రజలకు బీజేపీపై విశ్వాసం పెరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు. నల్లమలలోని ఉమామహేశ్వర క్షేత్రంకు ప్రసాద్ స్కీం కింద తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని, భూత్పూరు–మన్ననూర్, అలంపూర్–నల్లగొండ జాతీయ రహదారుల కోసం కృషి చేస్తామన్నారు. ఆదివాసీలను ఆదుకునేందుకు నల్లమలలోని వనరులతో మెడిసిన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రావు, బాలాజీ, నాగరాజు, శ్రీనునాయక్, గోపాల్ పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో కేంద్ర మంత్రి పూజలు

అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం కేంద్ర ప్రసార, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి ఎల్.మురుగన్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి సిబ్బంది మంత్రికి వివరించారు. ప్రకృతి రమణీయమైన ప్రదేశం ఉమామహేశ్వరమని, ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. బాలాజీ, మంగ్యానాయక్, రేణయ్య, నరేందర్‌రావు, సైదులు, జానకి, శ్రీనునాయక్, అఖి, దేవేందర్ పాల్గొన్నారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి

● సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా
● నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: నడిగడ్డ ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే వెనకబడిన అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై పార్లమెంట్‌లో గళం విప్పుతానని అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఒకప్పుడు తుంగభద్ర నదిపై ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి అలంపూర్–ర్యాలంపాడు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించారన్నారు. తాను అధికారిగా ఉన్న సమయంలో కేసీఆర్ సహకారంతో ఈప్రాంతానికి గురుకులాలను తీసుకొచ్చానని చెప్పారు. ఎంపీగా గెలిపిస్తే నవోదయ, సైనిక పాఠశాలల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జోగుళాంబ పుణ్యక్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దే అవకాశం తనకు ఇవ్వాలని కోరారు.

❐ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో అన్ని వర్గాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందడంతో పాటు 24 గంటల నాణ్యమైన కరెంటు సరఫరా చేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ తాగునీళ్లు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. నీటి సమస్య కూడా తప్పడం లేదన్నారు. ఆరు గ్యారంటీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏఒక్క హామీ నేరవేర్చలేదన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అంటున్నా మనకు కనీసం బస్సులు లేవన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయుడిని 30 వేల మెజార్టీతో గెలిపించారని.. ఇప్పుడు ప్రవీణ్‌కుమార్‌ని అంతకంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అలంపూర్ ప్రాంతానికి చెందిన ఆర్‌ఎస్‌పీని ఎంపీగా గెలిపించి, మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే విజయుడు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ బీజేపీ మాటతప్పిన పార్టీలే..

● కేసీఆర్ తెలంగాణను దేశంలో నంబర్‌వన్‌గా నిలబెట్టారు
● ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని



నంచర్లగేట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

మహమ్మదాబాద్/గండీడ్: కాంగ్రెస్, బీజేపీ రెండూ మాటతప్పిన పార్టీలేనని వారిని ఇంటికి పంపాల్సిందేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నంచర్లగేట్ కన్వెన్షన్‌హాల్‌లో ప్రచారసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోర విఫలమైందని తెలిపారు. మార్పు తీసుకువస్తామని మహిళలకు ఇచ్చిన హామీలు ఐదు నెలలు అవుతున్నా ఒక్కటి కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. మరో వైపు బీజేపీ పదేళ్లపాటు అధికారంలో ఉన్నా ప్రతి ఖాతాదారుని అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తామని హామీ ఇచ్చి మోసం చేయలేదా అని ప్రశ్నించారు. మోదీ ప్రజలకు మోసం చేయడానికే ప్రధాని అయ్యారని అలాంటి పార్టీలకు ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిజ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అబద్దాలు, మోసం మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్ని రోజులు నిలవలేవని తెలిపారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, కొప్పుల మహేశ్‌రెడ్డి, అనిల్‌రరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, లక్ష్మి, అనురాధ, గోపాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్, గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలం బీఆర్‌ఎస్‌దే



ధర్మాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయిందని, రాబోయే కాలం బీఆర్‌ఎస్ పార్టీదే అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపూర్, వెంకటాపూర్, రామచంద్రాపూర్, కోడూరు, జమిస్తాపూర్‌లో ఆయన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ అభివృద్ధి అంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, గత 60 ఏళ్లుగా అధికారంలో ఉన్న పార్టీలు తెలంగాణకు చేసింది ఏమీ లేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 పథకాల అబద్ధపు హామీలిచ్చి నాలుగు నెలలు దాటినా ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పథకాలు అమలు చేయకుండా ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీకి లేదని, బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న అన్ని పథకాలను కాంగ్రెస్ నిలిపివేసిందని మండిపడ్డారు. గ్రామాలకు బీటీ రోడ్లు, నీళ్లు, మహిళా సంఘాలకు భవనాలు, పార్కులు కల్పించామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో కరెంట్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ పోల్స్ వేయిస్తే ఇప్పుడు కరెంట్ ఇచ్చే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. పేద ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం, పెంచిన పెన్షన్ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ గళం బలంగా ఉండాలంటే మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ హక్కులతోపాటు మహబూబ్‌నగర్ నియోజకవర్గ అవసరాల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించానని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ ఈ ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచన చేయలేదని, ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్‌గౌడ్, మంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, తిరుపతయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైన లక్ష్యం కోసమే గంటానాథం



ఆలయంలో గంటకొడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్రమైన లక్ష్యం కోసమే గుడిగంటలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు పాలమూరు ఓటర్లకు అగ్నిపరీక్ష లాంటివన్నారు. ప్రజలు వివేకం, విచక్షణ, ఆలోచనతో ఓటు వేసేలా భగవంతుడు చూడాలని కోరుతూ అమ్మవారి వద్ద పూజలు చేసి గంటానాథం చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి కృషిచేస్తున్నారని, పార్లమెంట్ నియోజకవర్గానికి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టోతో ప్రజల ముందుకు పోతున్నట్లు చెప్పారు. పీయూలో ఇంజినీరింగ్, లా, పట్టణంలో డిగ్రీ కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్, కొడంగల్‌లో మెడికల్ కళాశాల, ఆస్పత్రి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల మధ్యలో నేషనల్ ఎడ్యుకేషన్ సంస్థ, షాద్‌నగర్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ వంటి వాటితో భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామన్నారు. అభివృద్ధికి విఘాతం కలిగించే నినాదాలతో ఇతర శక్తులు పాలమూరు ప్రజలను ద్రోహం చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అభివృద్ధి, పిల్లల భవిష్యత్ కోసం ఈ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే పార్టీ మార్పు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ

నారాయణపేట: పట్టణ అభివృద్ధిలో భాగంగానే బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ స్పష్టం చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ ఎండి సలీం అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారాయణపేట పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చేస్తున్న కృషిలో భాగంగానే తాము కాంగ్రెస్‌లో పార్టీలో చేరామని, ఇతరత్రా కారణాలు లేవన్నారు. తాజాగా పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.200కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, కౌన్సిలర్ అమరుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సరాఫ్ నాగరాజ్, సుధాకర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. గురువారం ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురం, ఉప్పరిపల్లిలో, గోపాల్‌పేటలో పర్యటించిన ఆయన ఉపాధి కూలీలు, గ్రామాల్లో ప్రజలను కలిసి మాట్లాడారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందని.. సీమాంధ్ర నాయకులతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఈ ప్రాంతంలో బీఆర్‌ఎస్ హయాంలో 11 నెలల్లో కాల్వలు తవ్వి చెరువులు, వాగుల ద్వారా పంటలకు సాగునీరు అందించామని గుర్తు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ 420 హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఉచిత బస్సు తప్పా ఏదీ అమలు చేయలేదని తెలిపారు. అలాంటి మోసగాళ్లకు మళ్లీ ఓటేసి మోసపోవద్దని.. పేదలకు న్యాయం చేయాలని ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బాలీశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 520, Amistapur Village, Bhoothpur Mandal, Mahabubnagar Dist - 509 382, Telangana, and Printed at Jagati Publications Limited, Survey No. 520, Amistapur Village, Bhoothpur Mandal, Mahabubnagar Dist - 509 382, Telangana. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0854 2236311. RNI Reg No. TELTEL/2008/23809. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.